క్లుప్తంగా

అభినందన సభ



మాట్లాడుతున్న ఆర్‌డీవో సాయిశ్రీ

బొబ్బిలి: స్థానిక సూర్య రెసిడెన్సీలో అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధుల నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన అధికారులను ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ సన్మానించి, అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉద్యోగులకు విధి నిర్వహణలో వారు అందించే మంచి సేవలే వారికి గుర్తింపును తీసుకువస్తాయన్నారు. మున్ముందు కూడా చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

చెడువ్యసనాల బారినపడొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: విద్యార్థులంతా బాగా చదువుకోవాలని, చెడువ్యసనాల బారినపడొద్దని ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణపై శుక్రవారం అవగాహన కల్పించారు. నేటితరం విద్యార్థులు, యువతీయువకులు మద్యం, గంజాయిలకు బానిసవుతూ జీవితం పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని తెలిపారు.

అష్టాదశ శక్తిపీఠాలకు పూజలు



అష్టాదశ శక్తిపీఠాలకు పూజలు చేస్తున్న మహిళలు

రాజాం: పట్టణంలోని మల్లిఖార్జున కాలనీలో వెలసిన కళ్యాణగౌరీ మల్లిఖార్జునస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 పౌర్ణమిల సందర్భంగా పారాయణం చేపట్టారు. అష్టాదశ శక్తిపీఠాలుగా అమ్మవారి ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. దేవాంగ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగినట్లు ఆలయ కమిటీ తెలిపింది. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించి, భక్తులకు అన్న ప్రసాదం పంచిపెట్టారు.

కౌలురైతులను ఆదుకోవాలి

రేగిడి: కౌలురైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు నారు జనార్దనరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని, మండలంలోని సంకిలి గ్రామ పంట పొలాల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతిలో ఎద్దులకు నాగలి కట్టి ఏరువాక సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతులు ఏటా ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆర్థికసాయం అందేలా చూడాలన్నారు. అలాగే బందిగెడ్డ, ఆకులలోవకట్టగెడ్డ, సాయన్నగెడ్డ కాలువలను పూర్తిస్థాయిలో ఆధునీకరించి ఖరీఫ్‌కు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

విత్తనాల పంపిణీపై ఏవో ఆరా



పాల్తేరు ఆర్‌బీకేలో విత్తనాల రికార్డులు పరిశీలిస్తున్న ఏవో శిరీష

బాడంగి: మండలంలోని ఆనవరం, బొత్సవానివలస, పాల్తేరు రైతు భరోసా కేంద్రాలను ఏవో శిరీష శుక్రవారం సందర్శించి, విత్తనాల పంపిణీపై ఆరాతీశారు. మండలంలో ఏ మేర ఏ పంట సాగు జరుగుతోంది.. రైతులకు ఎంత మేర ఏయే విత్తనాలు అందజేశారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 90 శాతం మేర విత్తనాలు అందజేయడం జరిగిందని, ప్రస్తుతానికి విత్తనాల కొరత లేదని సిబ్బంది తెలిపారు. రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించి, సాగు సలహాలు, సూచనలు అందివ్వాలన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



గొల్లవీధిలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని గొల్లవీధి, ఎల్‌ఐసీ కార్యాలయం వెనుక ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. వీధుల్లోని చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన మురుగు, పూడికలు తొలగించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.



తెర్లాం: యోగా డే అక్షరాకృతిలో నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాల్లో ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో యోగా గురువులు యోగా విశిష్టతను వివరించారు. అనంతరం పలు యోగాసనాలు నేర్పించి, వాటి ప్రయోజనాలు తెలిపారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, మనందరి దైనందిన కార్యక్రమాల్లో యోగా ఒకభాగం కావాలని పిలుపునిచ్చారు. అనేక శారీరక, మానసిక రుగ్మతల నుంచి యోగా ఉపశమనం కలిగిస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్లమంది జీవితాల్లో యోగా భాగమవడం యోగాకున్న శక్తికి నిదర్శనమన్నారు. –బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్.

‘యోగ’మస్తు..!



తెర్లాం: పెరుమాళి ఆదర్శ పాఠశాలలో యోగసనాలు వేస్తున్న విద్యార్థులు



బాడంగి గురుకుల పాఠశాలలో యోగాసనాలు సాధన చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రాజాం సిటీ: పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల యోగా విన్యాసం



రామభద్రపురం పీహెచ్‌సీలో యోగా చేస్తున్న ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు



రామభద్రపురం భవిత కేంద్రంలో చిన్నారులతో యోగాసనాలు వేయిస్తున్న ఎంఈవోలు తిరుమల ప్రసాద్, పెంటయ్య



వంగర: యోగా అక్షరాకృతిలో ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



సంతకవిటి: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల యోగా సాధన



రాజాం: వరలక్ష్మి సెయింట్ ఆన్స్ స్కూల్‌లో యోగా డే



రాజాం సిటీ: కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు వివేక్ ఆనంద్, కృష్ణసాయితేజ తదితరులు



రేగిడి: దేవుదళ కేజీబీవీలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మి



బొబ్బిలి: సంస్థానం ఉన్నత పాఠశాలలో యోగా సాధన చేస్తున్న యువత



బొబ్బిలి: గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో యోగా డే ఆకృతిలో విద్యార్థులు



బొబ్బిలి కోర్టు ఆవరణలో యోగా సాధన చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి రోహిణీరావు, న్యాయవాదులు



బొబ్బిలి: యోగాలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి దామోదరరావు

బొబ్బిలి: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక కోర్టు సముదాయంలో ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు కోరారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయ, పోలీస్, ఎస్‌ఈబీ శాఖల అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆయన.. లోక్ అదాలత్ సేవలపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అన్నిరకాల సివిల్ కేసులతో పాటు, రాజీకాదగ్గ క్రిమినల్ కేసులను సైతం లోక్ అదాలత్‌లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమావేశంలో బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, సీఐ ఎం.నాగేశ్వరరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహన్ మురళీకుమార్, కె.సింహాచలం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: మండల పరిధిలోని అంతకాపల్లి, వీఆర్ అగ్రహారం గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జి.సిగడాం మండలం, టంకాలదుగ్గివలస గ్రామానికి చెందిన టంకాల సురేష్ అనే వ్యక్తికి గాయాలైనట్లు ఏఎస్‌ఐ జనార్దనరావు తెలిపారు. సురేష్ తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సురేష్ తలకు, కాలుకు తీవ్రగాయాలయ్యాయి. అదే ఆటోలో రాజాంలోని కేర్ ఆస్పత్రికి అతడిని తరలించి చికిత్సనందించారు. బాధితుడి అన్నయ్య కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



చాటాయివలసలో ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు, వైద్యారోగ్య సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేసి, దోమల నివారణ మందు పిచికారీ చేయించాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యారోగ్య సిబ్బంది జ్వరపీడితులను గుర్తించి, వారికి సత్వరమే చికిత్స అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అప్పారావు, ఏఎన్‌ఎం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం శుక్రవారం జరిగింది. 10 మంది చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మావతి, గ్రామ పురోహితులు కిన్నెరకాంత అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది..



రామభద్రపురం జాతీయ రహదారిలో ఏర్పడిన స్తంభించిన ట్రాఫిక్

రామభద్రపురం: మండల కేంద్రంలోని ఇరుకైన రోడ్లు మీదుగా ప్రయాణిస్తున్న భారీ వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్య నిత్యం వేధిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. తరచూ భారీ లారీలు, ట్రక్కులు, కంటెయినర్లు ఈ రోడ్డు మీదుగా వస్తుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి అటు బొబ్బిలి జంక్షన్, ఇటు గ్రామం మధ్యలో సాలూరు వెళ్లే దారి చివరి వరకు వ్యాపారులు, ఇంటి యజమానులు ఆక్రమణలు పెరిగిపోవడంతో 40 అడుగుల రోడ్డు 20 అడుగులకు కుచించుకుపోయింది. రోడ్డుపై వరకు వచ్చిన దుకాణాలతో పాటు వాటి ముందు పార్కింగ్ చేసే వాహనాల కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటుందని వాపోతున్నారు. ఇదే విషయమై అధికారులను ఎన్నోసార్లు కలిసి, విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీధర్ రోడ్డు పక్కన ఉన్న దుకాణాదారులతో సమావేశమై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా రోజూ అదే తీరు..ట్రాఫిక్ సమస్య వేధిస్తూనే ఉందంటున్నారు.

తోటపల్లి పిల్లకాలువ మరమ్మతులు

తెర్లాం: మండలంలోని ఆమిటి దగ్గరలోని తోటపల్లి పిల్లకాలువకు పడిన గండికి సంబంధించిన మరమ్మతు పనులను సంబంధిత అధికారులు శుక్రవారం చేపట్టారు. కాలువకు గండిపడిన విషయాన్ని ఆమిటి, కొరటాం తదితర గ్రామాల రైతులు బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగారావు(బేబీనాయన) దృష్టికి తీసుకువెళ్లగా, స్పందించిన ఆయన.. ఇటీవల అక్కడికి వెళ్లి, కాలువకు పడిన గండిని పరిశీలించారు. అనంతరం మరమ్మతు పనులకు ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. కాలువకు పడిన గండిని పూడ్చి సాగునీరు సాఫీగా తరలి వెళ్లేలా చూడాలని తెలిపారు. స్పందించిన అధికారులు ఇప్పుడు మరమ్మతులు చేపడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో పుట్టిన బిడ్డను చూపిస్తున్న ఈఎంటీ వెంకటరమణ

తెర్లాం: 108 వాహనంలో ఓ గర్భిణీ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన ఘటన శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని సింగిరెడ్డివలస గ్రామానికి చెందిన హరితకు పురిటినొప్పులు రావడంతో తెర్లాం 108 వాహనానికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. గ్రామానికి వచ్చిన 108 వాహనంలో సదరు గర్భిణీని ఎక్కించుకుని, ఆస్పత్రికి తీసుకువెళ్తున్నారు. కొంతదూరం వెళ్లేసరికి హరితకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. వాహనంలో ఉన్న ఈఎంటీ బోను వెంకటరమణ సలహాలు, సూచనలతో ఆమె ప్రసవం సుఖవంతంగా జరిగింది. ఆలస్యం చేయకుండా 108 వాహనం తెచ్చినందుకు, సుఖంగా ప్రసవం జరిగేలా చర్యలు తీసుకున్న 108 వాహన సిబ్బందికి హరిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వరి విత్తనాల పంపిణీ



తెర్లాం: వెలగవలసలో రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న మండల వైస్ ఎంపీపీ సత్యనారాయణ



రేగిడి: చాటాయివలస ఆర్‌బీకే వద్ద రైతులకు విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ గోవిందరావు

తెర్లాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి పంటను సాగు చేసేందుకు వీలుగా రాయితీపై పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు చేపేన సత్యనారాయణ రైతులను కోరారు. మండలంలోని వెలగవలస ఆర్‌బీకే వద్ద రైతులకు వరి విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ చేతులమీదుగా పలువురు రైతులకు విత్తనాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రైవేటు వర్తకుల వద్ద వరి విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు తీసుకువెళ్లి, నాటుకోవాలన్నారు.

రేగిడి: మండలంలో పలు ఆర్‌బీకేల వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. చాటాయివలస ఆర్‌బీకే కేంద్రం వద్ద సర్పంచ్ కరణం గోవిందరావు చేతుల మీదుగా పలువురు రైతులకు విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యంత్రసాయంతో వరి సాగు బాగు



గడిముడిదాంలో ఫెర్టికమ్ సీడ్రిల్ యంత్రం ద్వారా వరి వెదలు వేయడాన్ని వివరిస్తున్న దేవుడుబాబు

రాజాం: యంత్రసాయంతో నేరుగా వరి సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ దేవుడుబాబు తెలిపారు. మండలంలోని గడిముడిదాం గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లావేటి మురళి, లావేటి సత్యనారాయణ, సూరిబాబు, రామినాయుడు తదితర రైతులకు చెందిన 6 ఎకరాల పొలాల్లో ఫెర్టికమ్ సీడ్రిల్ యంత్రం ద్వారా వరి వెదలు వేయడం శుక్రవారం శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు యాంత్రీకరణ వినియోగించుకుని, వ్యవసాయం చేయాలన్నారు. వరి సాగులో ఇంకా సంప్రదాయ పద్ధతులు అవలంభిస్తున్నందునే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాల్లో భాగమైన యంత్రం సాయంతో వెద సాగు పద్ధతి ఎంతో లాభదాయకమన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ సాగు చేసుకుంటే ఎకరాకు కేవలం 12 నుంచి 15 కిలోల వరి విత్తనాలతో 28 బస్తాల ధాన్యం దిగుబడి సాధించవచ్చని తెలిపారు. చీడపీడల నివారణతో పాటు తక్కువ నీటి ఖర్చుతో పంట సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ మంత్రి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పెంపకంలో సంరక్షకుల పాత్ర కీలకం



పిల్లల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రామభద్రపురం: రెండేళ్ల లోపు చిన్నారుల పెంపకంలో సంరక్షకుల పాత్ర చాలా కీలకమని ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లల పెంపకంలో సంరక్షకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కల్పించారు. చిన్నారుల సంరక్షణ, ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలే వారికి తెలియజేయాలన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలలో తల్లిండ్రదులు, కుటుంబం పాత్ర ప్రధానమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను కార్యకర్తలు బాగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, కృష్ణకుమారి, రత్నకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు పాల్గొన్నారు.